న్యూస్‌రీల్

ఎన్‌జీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: షెడ్యూల్డు తెగలకు సేవ చేసే ఎన్‌జీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఎల్ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీలకు సేవ చేసే సంస్థలై ఉండాలని, విద్య, ఆరోగ్యం, జీవనోపాధుల వంటి రంగాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎన్‌జీఓలకు ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. ఇతర పూర్తి వివరాలకు https://ngo.tribal.gov.in/ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

నేడు 150 క్లస్టర్లలో సమావేశాలు

ఒంగోలు సిటీ: డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలను అనుసరించి జిల్లాలోని 150 క్లస్టర్లలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి క్లస్టర్ సమావేశాలు నిర్వహించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ నిర్వహణకు అవసరమైన ఐ.ఎఫ్.పి. ప్యానల్స్, ఇంటర్‌నెట్ సదుపాయాల విషయమై క్లస్టర్ సమావేశాలు తగు జాగ్రత్తలతో నిర్వహించాలన్నారు. క్లస్టర్ పరిధిలో మ్యాపింగ్ చేసిన అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఇప్పటికే ప్రాథమిక, సెకండరీ క్లస్టర్ల నిర్వహణకు సంబంధించిన అజెండా ప్రకారం అన్ని క్లస్టర్లలో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

నేడు దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్ హాలులో శనివారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు, జిల్లా అధికారులు, దివ్యాంగులు పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు.

వల్లూరమ్మ ఆలయ ఆదాయం రూ.28.36 లక్షలు



వేలంలో పాల్గొన్న పాటదారులు, అధికారులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి రూ.28.36 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం దుకాణాల బహిరంగ వేలం దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన వివిధ అంశాలకు, దుకాణాలకు ఒక ఏడాది కాలం లీజుకు బహిరంగ వేలం నిర్వహించామని చెప్పారు.


నిబద్ధత, నిస్వార్థంతో పనిచేసే కార్యకర్తలకు విలువ

- కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సిటీ: భారతీయ జనతాపార్టీ కార్యకర్తల పార్టీ అనీ, నిబద్ధత, నిస్వార్థంతో పనిచేసే కార్యకర్తలకు ఎంతో విలువ ఇస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఒంగోలులోని శ్రీబాలాజీ తిరుపతిరావు ఫంక్షన్ ప్యాలెస్‌లో శుక్రవారం బీజేపీ జిల్లా నూతన అధ్యక్షునిగా శెగ్గెం శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జా, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్త అయిన తనను ఎంపీగా, కేంద్రమంత్రిగా ఇచ్చి పార్టీ గౌరవించిందన్నారు. అలాగే శెగ్గెం శ్రీనివాసరావు కూడా నిస్వార్థ సేవను, పార్టీ పట్ల ఆయన కున్న క్రమశిక్షణ చూసి జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, క్విస్ కాలేజీ చైర్మన్ సూర్యకళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన శెగ్గెం శ్రీనివాసరావు జిల్లాలో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు పి.వి.శివారెడ్డి, పి.వి.కృష్ణారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, శాసనాలు సరోజిని, కొమ్మి నరసింగరావు, యోగయ్యయాదవ్, డి.జియాదత్, ఎన్.శ్రీనివాసులురెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, తోగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



హోంగార్డులు.. పోలీస్‌శాఖలో వీరిది కీలకపాత్ర. ఈ శాఖలోని అధికారులకు, వీరికి ఒకటే రంగు ఖాకీ యూనిఫాం. ఇద్దర్నీ పోలీస్ అనే పిలుస్తారు. అయితే చేసే పని మాత్రం వేరు. జీతం తక్కువైనా రెగ్యులర్ పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పనిమాత్రం పోలీస్ బాస్‌ల ఇళ్లవద్ద చేస్తున్నారు. యూనిఫాం సర్వీసులో అత్యంత అల్పజీవులుగా చులకన బతుకులు వీరివి. వెట్టిచాకిరి చేస్తున్నా పొట్టగడవక కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ కూలీలకైనా ఇన్ని గంటల పని అని ఒక లెక్క ఉంటుంది. వీళ్లకు అదేం లేదు. సార్ చెబితే చేయాల్సిందే. లేదంటే అంతే. సెలవులుంటాయా అంటే అదీ లేదు. జీతమూ అంతంతమాత్రమే. పోనీ, ఉద్యోగ భద్రత ఉంటుందా అంటే అదీ లేదు. ఒళ్లు వంచి ఏళ్ల తరబడి పనిచేసినా రిటైర్మెంట్ రోజు ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి వీరిది.



హోంగార్డులు (ఫైల్)

ఖాకీలో సగమై.. జీవితం కరువై..!

- పోలీసు శాఖలో హోంగార్డుల వెట్టిచాకిరి
- రోజువారీ వేతనాలతో దుర్భర బతుకులు
- సెలవు పెడితే జీతం కట్
- ఇంటి పనులు చేయించుకుంటున్న పోలీసు అధికారులు
- జిల్లాలో ఆదుకుంటున్న హోంగార్డు కో ఆపరేటివ్ సొసైటీ

ఒంగోలు టౌన్:

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 800 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. వీరిలో 100 మంది వరకు మహిళా హోం గార్డులు ఉన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు తోడుగా పనిచేయాల్సిన ఈ హోంగార్డుల్లో 100 నుంచి 150 మంది వరకు ఉన్నతాధికారుల సేవలో తరిస్తున్నట్లు సమాచారం. ఐపీఎస్ అధికారుల దగ్గర నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్సైల వ్యక్తిగత సేవకు హోంగార్డులను ఉపయోగించుకుంటున్నారని సమాచారం. ఇంటికి కూరగాయలు తీసుకురావడం దగ్గర నుంచి పిల్లలను స్కూల్లో వదిలి రావడం, తిరిగి స్కూల్ వదిలినప్పుడు ఇంటికి తీసుకెళ్లడం వంటి పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసుస్టేషన్లలో కూడా వీరిని వదిలిపెట్టడం లేదు. ఉదయం, సాయంత్రం సీఐ, ఎస్సైలకు టీ, టిఫిన్ తీసుకురావడానికి హోంగార్డులను ఉపయోగిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అధికారులు చెప్పిన మాట వినకపోయినా.. పనులు చేయకపోయినా ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం పోలీసు శాఖలో ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేసినట్లు చెబుతున్నా మరోవైపు అధికారులు మాత్రం అనధికారికంగా ఆర్డర్లీ వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

పోలీసు ఉద్యోగాల్లో కోటా పెంపు...

జీతాలు పెంచడమే కాకుండా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో వీరి కోటాను సైతం వైఎస్ జగన్ హయాంలో పెంచారు. 2022లో 6,100 పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి వరకు కానిస్టేబుల్ ఉద్యోగాలలో కేవలం 8 శాతం కోటా మాత్రమే హోంగార్డులకు ఇచ్చేవారు. దాన్ని 15 శాతానికి పెంచుతూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. జీతాలు పెంచడమే కాకుండా కానిస్టేబుల్ ఉద్యోగాల్లో వీరి కోటా కూడా పెంచి అండగా నిలిచింది.

ప్రసూతి సెలవులు కూడా లేవు...

జిల్లాలో 100 మంది మహిళా హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ప్రసూతి సెలవులు కూడా లేకపోవడం దారుణం. పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికులకు కూడా ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. మరి హోంగార్డులకు ఆ నిబంధనలు ఎందుకు వర్తించవో అర్థం కావడం లేదు.

సెలవులు లేని ఉద్యోగం...

హోంగార్డుల పరిస్థితి బానిస బతుకుల కంటే ఘోరంగా ఉంటుంది. వీరికి గౌరవ వేతనం పేరుతో రోజువారీ వేతనాలు ఇస్తున్నారు. పనిచేస్తేనే వేతనం ఉంటుంది. లేకపోతే ఆ రోజు వేతనం కట్. అందరిలాగే వీరికి ఇంటి పనులుంటాయి. భార్యాపిల్లల బాగోగులు చూడాల్సిన బాధ్యతలు ఉంటాయి. తల్లిదండ్రుల అనారోగ్యాలు వేధిస్తుంటాయి. అయితే, పోలీసు శాఖలో పనిచేస్తున్న వీరికి బంధాలు, బాధ్యతలకు తావు లేదు. ఆరోగ్యం బాగున్నా.. లేకపోయినా పనిచేయక తప్పదు. ఎందుకంటే వీరికి ఎలాంటి సెలవులు లేవు. పనిచేస్తేనే వేతనం వస్తుంది. లేకపోతే ఆ రోజు వేతనం కట్. ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు కూడా వీరికి వర్తించవు. దీంతో అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు.

జిల్లాలో హోంగార్డు కో ఆపరేటివ్ సొసైటీ...

ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడటం దండగనుకుని జిల్లాకు చెందిన హోంగార్డులు 2019లో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. సొసైటీ సభ్యులకు రుణాలు ఇవ్వడం, అత్యవసర సమయంలో ఆర్థికంగా ఆదుకోవడం, పిల్లల పెళ్లిళ్లు, చదువుల విషయంలో అండగా నిలబడటం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్కరోజులోనే లక్ష రూపాయల వడ్డీ లేని రుణం ఇవ్వడం గొప్ప విషయం.

రాజన్న నుంచి జగనన్న వరకు వేతనం పెంపుదల...

2006 వరకు హోంగార్డుల జీతాలు మరీ తక్కువగా ఉండేవి. రోజుకు కేవలం రూ.75 ప్రకారం నెలకు రూ.2,200 మాత్రమే ఇచ్చేవారు. దీన్ని గమనించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.800 పెంచి నెలకు రూ.3,000 చేశారు. అనంతరం కూడా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని హోంగార్డుల వేతనాలు పెంచుతూ పోయారు. 2008లో రూ.4,700, 2009లో రూ.6,000కు పెంచారు. ఆ తర్వాత క్రమంగా 18 వేల రూపాయలకు చేరింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కోవిడ్ మహమ్మారి దెబ్బకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. అయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం హోంగార్డుల వేతనాలను ఏకంగా రూ.3,300 పెంచి 2019 నుంచి రూ.21,300 చెల్లిస్తున్నారు.

ఒట్టి చేతులతో ఇంటికి...

ఏళ్ల తరబడి హోంగార్డులుగా పోలీసు శాఖలో సేవలందించినప్పటికీ రిటైర డ్మంట్ సమయంలో ఆ శాఖ నుంచి ఒక్క రూపాయి కూడా రాకపోవడం దారుణం. దురదృష్టవశాత్తూ చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు కూడా ఒక్క రూపాయి సాయం అందించని అమానవీయ పరిస్థితులు పోలీసు శాఖలో కొనసాగుతుండటం గమనార్హం. ఇలాంటి వారిని ఆదుకునేందుకు జిల్లాలోని హోంగార్డు కో ఆపరేటివ్ సొసైటీ ముందుకొచ్చింది. రిటైరైన, చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు తమ వేతనం నుంచి ఒకరోజు వేతనాన్ని సేకరించి సాయంగా అందజేయడం విశేషం. ఇది పాలకులకు, పోలీసు పెద్దలకు ఒక చెంపదెబ్బ లాంటిదని చెప్పవచ్చు.

వేధింపులతో ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు

- ఏ తప్పూ చేయలేదంటూ గ్రామసభలో కంటతడిపెట్టిన యడవల్లి ఎఫ్‌ఏ

రాచర్ల: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి నాయకులు వేధిస్తూ వారిని విధుల నుంచి తొలగిస్తున్నారు. మండలంలోని సోమిదేవిపల్లె, యడవల్లి, చినగానిపల్లె, గుడిమెట్ట, సత్యవోలు పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజీనామా చేయాలంటూ కూటమి నాయకులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి వారిని విధుల నుంచి తొలగించారు. తొలుత మీరే రాజీనామా చేయాలని, లేకుంటే విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో గుడిమెట్ట ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా చేశాడు. యడవల్లి ఎఫ్‌ఏను సామాజిక తనిఖీలో భాగంగా జాబ్‌కార్డుల్లో ఉన్నవారితో పనులు చేయించకుండా ఇతర వ్యక్తులతో పనులు చేయించి బిల్లులు చేశారంటూ ఈ నెల 11వ తేదీన యడవల్లిల్లో జరగాల్సిన గ్రామసభకు రాజీనామా లేఖ ఇవ్వాలని ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఆమె ఇంట్లోనే ఒత్తిడి తీసుకొచ్చారు. 13వ తేదీన కూటమి నాయకులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఎఫ్‌ఏకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామసభలు నిర్వహించుకుని వెళ్లిపోయారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశానికి యడవల్లి ఎఫ్‌ఏ హాజరై తాను ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలు చేయలేదని అధికారులతో తన బాధ చెప్పుకుని కంటతడి పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది.



సమావేశంలో బాధతో వెళ్లిపోతున్న యడవల్లి ఎఫ్‌ఏ నూర్జహాన్

20న విద్యుత్ రీడర్స్ ప్రథమ మహాసభ



రీడర్స్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు టౌన్: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు శ్రీరాం శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా విద్యుత్ బిల్లుల రీడింగ్ తీస్తున్నా స్మార్ట్ మీటర్ల పుణ్యమాని నేడు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. వారికి విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలో రీడర్ల సమస్యలను చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.పిచ్చయ్య, బి.సిద్దయ్య, మల్లికార్జున దత్తు పాల్గొన్నారు.

క్రీడలు సమైక్యతకు చిహ్నం





వాలీబాల్‌లో తలపడుతున్న ప్రకాశం, వైఎస్సార్ కడప జట్లు

ఒంగోలు: క్రీడలు సమైక్యతకు చిహ్నమని 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి పేర్కొన్నారు. మండలంలోని కరువదిలో దివంగత సూరిగుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన శిష్యులు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల ఇన్విటేషన్ పోటీల ప్రారంభోత్సవానికి శుక్రవారం రాత్రి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయునిగా హనుమంతరావు అందించిన సేవలే ఆయన శిష్యులకు స్ఫూర్తిగా నిలిచి నేడు ఆయన జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. సభాధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ సీనియర్ మేనేజర్ పాలేటి కనక రాజేశ్వరరావులు క్రీడాకారులు, క్రీడాభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. మూడు రోజులపాటు ఈ పోటీలు పూర్తి ఫ్లడ్ లైట్ల వెలుగులో జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం ప్రకాశం–వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన పోటీ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది.

ఊరంతా ఒక్కటై..అభివృద్ధి వీచికై..

ఏళ్ల తరబడి గూడుకట్టుకున్న సమస్యలను ఎవరో వచ్చి పరిష్కరిస్తారని ఆ ఊరి యువత ఎదురుచూడలేదు. ఊరంతా ఒక్కటైతే సాధించలేనిది ఏదీ లేదని ఐక్యంగా ముందడుగు వేశారు. ఒక్కో రూపాయి కూడగట్టుకుని లక్షలు పోగేసి ఊరి రూపురేఖలు మార్చేందుకు నడుంకట్టారు. ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటున్న ఆ ఊరి కథేంటో చూద్దాం..

- ఐక్యతతో ఆదర్శం వైపు అడుగులు
- గ్రామాభివృద్ధికి నడుం బిగించిన బొడ్డువారిపాలెం యువత
- పక్కా ప్రణాళికలతో పనులు



మరమ్మతుల అనంతరం చెరువు కట్ట



ఆధునికీకరిస్తున్న శ్మశానం

సంతనూతలపాడు: దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న రోడ్లు, చిల్లచెట్లతో నిండిపోయిన చెరువుతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఆ ఊరు మండలంలోని బొడ్డువారిపాలెం. అయినా ఆ గ్రామ రైతులు తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించారు. గ్రామానికి చెందిన యువత అత్యధికంగా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. మరికొందరు విదేశాలకూ వెళ్లారు. గ్రామంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఊరిలోని కొందరు యువకులు నడుంబిగించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన వారు 150 మంది వరకు ఉన్నట్లు గుర్తించి వారందరితో తమ ఆలోచనలు పంచుకున్నారు. దీంతో వారూ చేయూతనందిస్తామని చెప్పారు. ఊరికి మంచి చేయాలని ఉద్దేశంతో ఉద్యోగాల్లో స్థిరపడిన యువత, ఇతర దేశాల్లో ఉంటున్న వారు సైతం చందాలు వేసుకుని దాదాపు రూ.4 లక్షలు పోగేశారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా శ్రీకారం చుట్టారు. ముందుగా గుంతలతో నిండి ఉన్న గంగవరం–బొడ్డువారిపాలెం గ్రావెల్ రోడ్డు, మంగమూరు–బొడ్డువారిపాలెం రోడ్లను గ్రావెల్ తోలి చదును చేసి బాగుచేసుకున్నారు. పిచ్చిచెట్లతో నిండిపోయిన శ్మశానం, చెరువు కట్టపై పిచ్చి చెట్లు తొలగించి సుందరంగా తీర్చిదిద్దుకున్నారు. కొణిజేడు–బొడ్డువారిపాలెం రోడ్డును కూడా బాగుచేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా..

గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతామని ఆ గ్రామ యువకులు తెలిపారు. గ్రామానికి వచ్చే అన్ని మార్గాలను బాగుచేసుకున్న తరువాత రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, సోలార్ దీపాల ఏర్పాటు, తాగునీటి వనరుల పరిరక్షణ చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వం కూడా సహకరిస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందని, తమ గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు.



గ్రావెల్‌తో వేస్తున్న గంగవరం–బొడ్డువారిపాలెం రోడ్డు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఆకస్మిక తనిఖీ



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు

అల్లూరు (కొత్తపట్నం): మండలంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారు... ఓటీపీలు వస్తున్నాయా, అన్ని గ్రామాల్లో సర్వర్ పనిచేస్తోందా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు చెప్పారు. 2025–26 నుంచి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీలేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర రాయితీ పథకాలన్నీ ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన రైతులకు మాత్రమే వర్తిస్తాయన్నారు. రైతు సేవా కేంద్రంలో రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్లు వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 26 వరకు గడుపు ముగిస్తుందన్నారు. రైతులంతా గమనించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టీబీబీజే మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ కార్యాలయ టీఏవో బి.శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి, నాగరాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ప్రేమగా మారి..

- పెద్దాపురం మండల బాలికను తీసుకొచ్చిన మారెళ్ల యువకుడు

ముండ్లమూరు(కురిచేడు): ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయిన బాలికను ప్రేమించిన యువకుడు ఆమె తల్లిదండ్రులకు తెలియకుండా తన ఇంటికి తీసుకొచ్చిన ఘటన ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో శుక్రవారం జరిగింది. ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామానికి చెందిన కనపర్తి అశోక్ (22) కూలి పనులు చేస్తుంటాడు. అందులో భాగంగా పనుల కోసం ఏడాది క్రితం కాకినాడ జిల్లాకు వెళ్లాడు. ఈక్రమంలో ఇన్‌స్టాగ్రాంలో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలికతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి బాలికను ఇంట్లో తెలియకుండా తన స్వగ్రామం మారెళ్లకు తీసుకొచ్చాడు. బాలిక కనపడటం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాలిక సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మారెళ్లలో ఉన్నట్లు గుర్తించి శుక్రవారం గ్రామానికి వచ్చిన పెద్దాపురం పోలీసులు ముండ్లమూరు ఎస్సై నాగరాజు సహకారంతో విచారణ చేపట్టి కనపర్తి అశోక్ ఇంట్లో ఉన్న బాలికను తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో పెద్దారవీడు వాసి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన వెంకట రమణ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు కథనం ప్రకారం.. గుంటూరు నుంచి పెద్దారవీడుకు ఎలక్ట్రానిక్ సామాను లోడుతో వస్తున్న వాహనాన్ని ఎదురుగా దొర్నాల నుంచి పిడుగురాళ్లకు వస్తున్న మరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో పెద్దారవీడు గ్రామానికి చెందిన అమనగంటి వెంకట రమణ సంఘటన స్థలంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు సంఘటన స్థలానికి హుటాహుటీన చేరుకొని తీవ్ర గాయాలతో బాధపడుతున్న సనకాల గోపి, సనకాల ఆంజనేయులు, కొటపాటి గోపి క్షతగాత్రులను 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవపంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

కంభం: అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం అర్ధరాత్రి మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పట్టుకున్నారు. సబ్ కలెక్టర్‌కు అందిన సమాచారం మేరకు.. పట్టణంలోని వై.జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించి ఓ మినీ లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని బియ్యం లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో తహసీల్దార్ వి.కిరణ్, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

- ఒకే రోజు 4 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ


సంఘటనా స్థలంలో రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ డీఈ, ఏఈ

తర్లుపాడు: ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు రెచ్చిపోతుండటంతో ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు లబోదిబోమంటున్నారు. తర్లుపాడు మండలంలో గురువారం రాత్రి గొల్లపల్లికి చెందిన రమణారెడ్డి, కారుమానిపల్లికి చెందిన కె.వెంకటరెడ్డి, మీర్జపేటకు చెందిన నాగరాజు, తర్లుపాడుకు చెందిన కాశిరెడ్డి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు పగలకొట్టి రాగి తీగను అపహరించారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాలను ఎస్సైతో కలిసి విద్యుత్ డీఈ సియానాయక్, ఏఈ హనుమానాయక్ పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే తమకు గానీ, పోలీసులకు గానీ సమాచారం అందించాలని సూచించారు.


గొల్లపల్లిలో ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గౌరవం పోయింది.. గర్వమే మిగిలింది!

ముస్లిం మైనారిటీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

- 11 నెలలుగా ఇమామ్, మౌజన్లకు అందని గౌరవ వేతనం
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 425 గుర్తింపు పొందిన మసీదులు
- మసీదుల నిర్వహణ భారంగా మారిందని మత పెద్దల ఆవేదన
- మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్న రంజాన్ మాసం
- తక్షణమే గౌరవ వేతనం విడుదల చేయాలని మైనారిటీ నేతల డిమాండ్



ఒంగోలు : అన్నవరప్పాడు 3వ లైన్‌లోని మదీనా మసీద్

ఒంగోలు వన్‌టౌన్/కంభం:

ఓట్ల వేటలో ముస్లిం మైనారిటీల ముందు సాగిల పడిన కూటమి నాయకులు గద్దెనెక్కిన తర్వాత గర్వాన్ని ప్రదర్శిస్తున్నారా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానమిస్తున్నారు ముస్లిం మత పెద్దలు. అధికారంలోకి రాకముందు కూటమి అధినేత చంద్రబాబు అలవికాని హామీలు గుప్పించారు. ఈ క్రమంలోనే మసీదుల్లో ఇమామ్, మౌజన్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని తాను అధికారంలోకి రాగానే పెంచుతానని జోరుగా ప్రచారం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నప్పటికీ ఇంత వరకు ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం పెంచడం కాదు కదా, కనీస వేతనం కూడా మంజూరు చేయకుండా దగా చేశారు. ఎన్నికల సమయంలో నిలిచిన 2 నెలలతో కలిపి మొత్తం 11 నెలలుగా ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం అందడం లేదు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన సుమారు 420 మసీదుల్లో ఇమామ్‌లు, మౌజన్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా పలు మసీదులకు సంబంధించి ఇమామ్‌లు, మౌజన్ లు గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున రెండు నెలల బకాయి పెట్టారు. ఎన్నికలు ముగిశాక కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలైనా పైసా కూడా మసీదులకు ఇవ్వలేదు. మొత్తంగా 11 నెలలకు సంబంధించి గౌరవ వేతనాన్ని విడుదల చేయాల్సి ఉంది. వేతన బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఇమామ్‌లు, మౌజన్లు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో సముచిత గౌరవం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో రూ.5 వేలు ఉన్న ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు, రూ.3 వేలుగా ఉన్న మౌజన్ గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచారు. అదే విధంగా ప్రతి నెలా గౌరవ వేతనం విడుదల చేసేవారు. ముస్లింల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసిన తర్వాత అప్పటి సీఎం వైఎస్ జగన్ వేతన పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. కాగా మసీదులనే నమ్ముకుని గౌరవ వేతనంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మౌజన్, ఇమామ్‌లను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారంగా మారిన మసీదుల నిర్వహణ

ఆర్థిక వనరులు, ఆదాయం లేని మసీదుల నిర్వహణ ప్రభుత్వం అందించే గౌరవ వేతనాల మీద ఆధార పడి ఉంటుంది. గౌర వేతనాలు చెల్లించడంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో ముస్లిం మత పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి గౌరవ వేతనాలు విడుదల చేయకపోతే మసీదుల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని మసీదు కమిటీ అధ్యక్షులు, మైనారిటీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గౌరవ వేతనంతో పాటు మసీదుల నిర్వహణకు అదనంగా నిధులు ఇస్తామని చెప్పిన నేతలు అదనపు నిధులు పక్కనపెడితే వారికి ఇవ్వాల్సిన గౌరవ వేతనం సైతం ఇవ్వకుండా విస్మరించడం దారుణమని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమీపిస్తున్న రంజాన్ మాసం

మరో 15 రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో మసీదులకు మరమ్మతులు, రంగులు వేయడం లాంటివి చేస్తారు. సహర్, ఇఫ్తార్, ప్రత్యేక తరావీ నమాజ్‌కు ప్రతి నెలా అయ్యే ఖర్చులకన్నా రంజాన్ మాసంలో అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి గౌరవ వేతనంతోపాటు మసీదుల నిర్వహణ కోసం అదనంగా నిధులు విడుదల చేయాలని ముస్లింలు కోరుతున్నారు.

భారంగా మసీదుల నిర్వహణ



11 నెలలుగా గౌరవ వేతనం విడుదల కాకపోవడంతో మసీదుల నిర్వహణ కష్టతరంగా మారింది. గతంలో గౌరవ వేతనం పొందే వారితో పాటు ఏడున్నర సంవత్సరాల క్రితం కొత్తగా గౌరవ వేతనాలు పొందడం కోసం పలువురు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. బకాయి నిధులు విడుదల చేయడంతోపాటు దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్న వారికి గౌరవ వేతనం మంజూరు చేయాలి.

– గుడిసె మహబూబ్ బాష, ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

రంజాన్ మాసంలో ఖర్చులు అధికం



మసీదుల నిర్వహణకు సంబంధించి రంజాన్ మాసంలో ఖర్చులు పెరుగుతాయి. 11 నెలలుగా గౌరవ వేతనం లేకపోవడంతో ఇమామ్, మౌజన్లకు కమిటీ తరఫున వేతనం ఇచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరో 15 రోజుల్లో రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపు గౌరవ వేతనం విడుదల చేయాలి. మసీదుల అభివృద్ధికి అదనంగా నిధులు విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– సయ్యద్ ఖాసిం, సాదుమియా వీధి మసీదు కమిటీ అధ్యక్షుడు, కంభం

త్వరలో వేతనం ఇస్తాం

గత పది నెలలుగా ఇమామ్‌లకు, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల కాలేదు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తాయి. ఆ తర్వాత గౌరవ వేతనం విడుదల చేస్తాం.

– పార్థసారథి, జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి

సంజీవయ్య జీవితం యువతకు ఆదర్శనీయం


సంజీవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం యువతకు ఆదర్శనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సంజీవయ్య 105వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదరికంలో పుట్టినప్పటికీ ఉన్నత విద్యనభ్యసించి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు లాంటి ఎన్నో పదవులను అధిష్టించారని కొనియాడారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సంజీవయ్య విలువలు, అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒంగోలు నగర మేయర్ సుజాత, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, బీసీ సంక్షేమ శాఖాధికారి అంజల, ఐసీడీఎస్ పీడీ హీనా సుజన్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రం, బిళ్లా చెన్నయ్య, దారా అంజయ్య, యాదాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారుపేరు.. సంజీవయ్య

ఒంగోలు టౌన్: ముఖ్యమంత్రిగా చిన్న వయసులోనే బాధ్యతలు చేపట్టిన దామోదరం సంజీవయ్య నిజాయితీకి మారుపేరుగా రాష్ట్రాన్ని పరిపాలించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతిని అరికట్టేందుకు దేశంలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీని ఏర్పాటు చేసి తన చిత్తశుద్ధిని సంజీవయ్య నిరూపించుకున్నారని కొనియాడారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్ ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. గాజులదిన్నె, పులిచింతల, వంశధార ప్రాజెక్టులను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కే నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఓఎస్ బాలయ్య, డీపీవో ఏవో రామ్మోహన్‌రావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో ప్రమోషన్‌లో ఉన్నవారికి శిక్షణ


శిక్షణ ఇస్తున్న జిల్లా ఉపగణాంకాధికారి వాసుదేవరావు, ఏఎస్ఓ

మద్దిపాడు: జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తూ పదోన్నతికి అర్హత కలిగిన 19 మంది జూనియర్ సహాయకులు, వీఆర్వోలు సర్వే శిక్షణ ముగించుకున్నారు. అనంతరం జిల్లా ప్రణాళికాశాఖ శిక్షణలో భాగంగా మద్దిపాడు మండలంలోని దొడ్డవరప్పాడులో రైతు నాగినేని వెంకటరావు పొలంలో పంట దిగుబడి ప్రయోగ పరీక్షలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపగణాంకాధికారి ఎంవీ వాసుదేవరావు పొలంలో దిగుబడిని అంచనా వేయడం, ప్రతికూల పరిస్థితుల్లో పంటనష్టాన్ని అంచనా వేయడంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలంలో ఉండే సహాయ గణాంకాధికారి ఇటువంటి పరీక్షలను నాలుగు చోట్ల నిర్వహించి నష్టాన్ని అంచనా వేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో శిక్షణ నిమిత్తం వీరందరినీ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. శిక్షణ పొందుతున్న వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏఎస్ఓ విజయలక్ష్మి, సంతనూతలపాడు ఏఎస్ఓ సుధాకర్‌రావు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసన్న, వీఆర్‌ఏ రాఘవులు పాల్గొన్నారు.

బి.ఎడ్ విద్యార్థిని తీరుపై ఏకసభ్య కమిటీ

- ఏకేయూ వీసీ మూర్తి ఏర్పాటు
- పరీక్ష కేంద్రం వద్ద విచారణ చేపట్టిన ప్రొఫెసర్ సోమశేఖర కమిటీ


విచారణ చేస్తున్న ప్రొఫెసర్ సోమశేఖర

ఒంగోలు సిటీ: సకాలంలో పరీక్ష పూర్తి చేసుకున్న విద్యార్థిని ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇన్విజిలేటర్‌కు ఇవ్వకుండా నేరుగా తాను బసచేసిన రూముకు తీసుకెళ్లిన సంఘటనపై ఆంధ్రకేసరి యూనివర్శిటీ (ఏకేయూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి సీరియస్‌గా స్పందించారు. గిద్దలూరులోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఈ సంఘటనపై శుక్రవారం తగు విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఆ మేరకు సోమశేఖర శుక్రవారం గిద్దలూరు వెళ్లి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోలిరెడ్డి, యూనివర్శిటీ పరిశీలకుడు ఓ.జయభారత్‌రెడ్డి, విద్యార్థి పరీక్ష రాసిన రూము ఇన్విజిలేటర్‌తో మాట్లాడారు. ఈ సంఘటనకు ప్రధాన కారణమై ఒరిస్సా రాష్ట్రానికి చెందిన విద్యార్థిని నుంచి కూడా లిఖిత పూర్వకమైన వివరణ తీసుకున్నారు. ఏకేయూ సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, పీజీ (నాన్ కాన్ఫిడెన్షియల్ విభాగం) కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విచారణ అనంతరం సోమశేఖర మాట్లాడుతూ గురువారం ఎస్.వి. డిగ్రీ కళాశాలలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి అన్ని అంశాలపై విచారణ చేపట్టామని, విచారణ నివేదికను ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తికి రెండు రోజుల్లో అందజేస్తామని తెలిపారు.

కుమార్తెకు మందులు తెచ్చేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మధుబాబు (ఫైల్)


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మధుబాబు

పొన్నలూరు: మూడేళ్ల కుమార్తెకు అనారోగ్యంగా ఉండటంతో మందులు తెచ్చేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు అనూహ్య రీతిలో మృత్యువాత పడ్డాడు. రోడ్డుపై ఒక్కసారిగా అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి బైక్‌తో సహా కింద పడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన పొన్నలూరు మండల పరిధిలోని ఆదిత్య కోల్డ్ స్టోరేజ్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పొన్నలూరు గ్రామానికి చెందిన పందిళ్ల మధుబాబు(27)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే తన మూడేళ్ల పాపకు ఆరోగ్యం బాగలేకపోవడంతో మందులు తేవడానికి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కందుకూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆదిత్య కోల్డ్ స్టోరేజ్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా రోడ్డుకు అడ్డుగా గేదె రావడంతో బైక్ అదుపు తప్పి ఢీకొట్టింది. మధుబాబుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

భూ వివాదం నేపథ్యంలో దాడి

- పీసీపల్లి మండలం మురుగమ్మిలో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఐదుగురు నిందితులపై కేసు నమోదు


గాయపడిన శబరి కంతారెడ్డి, వెంగళరెడ్డి

పీసీపల్లి: పొలం విషయంలో కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య సాగుతున్న వివాదం దాడికి దారితీసింది. పీసీపల్లి మండలం మురుగమ్మి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మురుగమ్మి రెవెన్యూ సర్వే నంబర్ 247లో 3.16 ఎకరాల భూమికి సంబంధించి గ్రామానికి చెందిన వల్లెం రాజశేఖరరెడ్డి, లెక్కల వెంగళరెడ్డికి మధ్య వివాదం తలెత్తింది. రాజశేఖర్‌రెడ్డి తనకు చెందిన 1.50 ఎకరాల భూమిని ఆక్రమించాడని గతంలోనే రెవెన్యూ, పోలీస్ అధికారులకు వెంగళరెడ్డి ఫిర్యాదు చేశాడు. 1986లో తమ నాయనమ్మ పేరు మీద పట్టా ఉందని వెంగళరెడ్డి చెబుతుండగా.. హద్దుల విషయం తేలలేదంటూ రాజశేఖర్‌రెడ్డి ఎకరాన్నర విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకుంటూ గేదెల షెడ్డు వేశాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకోగా పోలీస్, రెవెన్యూ కార్యాలయాల్లో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో వెంగళరెడ్డి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. మూడు రోజుల క్రితం స్వాధీనం చేసుకున్న భూమిలో రేకుల షెడ్డును కూల్చివేసి, బావిని పూడ్చారు. ఇదంతా మనసులో పెట్టుకున్న రాజశేఖర్‌రెడ్డి కసితో రగిలిపోయాడు. గురువారం రాత్రి శబరి కంతారెడ్డితో కలిసి బైక్‌పై వెళ్తున్న లెక్కల వెంగళరెడ్డిపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులిద్దరినీ హుటాహుటిన ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు.

గ్రామంలో పోలీస్ పికెట్

వెంగళరెడ్డి, శబరి కంతారెడ్డిపై దాడి విషయం తెలుసుకున్న కనిగిరి సీఐ ఖాజావలి, ఎస్సై జి.కోటయ్య తమ సిబ్బందితో శుక్రవారం మురుగమ్మి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. తమపై వల్లెం రాజశేఖర్ రెడ్డి, రాజేశ్వరి, వల్లెం మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీదేవి, వల్లెం సరోజినమ్మ కలిసి దాడి చేశారని వెంగల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేపు జిల్లా స్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక

సింగరాయకొండ: స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌టీ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయి జట్లకు ఎంపికైన వారు ఈ నెల 21, 22 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నగల దుకాణంలో చోరీ

- 60 గ్రాముల బంగారం అపహరణ

కురిచేడు: స్థానిక నగల దుకాణంలో చోరీ జరిగింది. 60 గ్రాముల బంగారాన్ని దొంగలు అపహరించారు. స్థానిక ఎస్సై శివ తెలిపిన వివరాల మేరకు.. బంగారు నగల వ్యాపారి దేవతి సుబ్రహ్మణ్యంకు చెందిన షాపులో కస్టమర్లుగా వచ్చిన కొందరు పట్టపగలే 60 గ్రాముల బంగారు ఆభరణాలను తస్కరించారు. ఆ మేరకు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పాత సామాన్లకు 18న వేలం

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలోని సంక్షేమ విభాగంలో గల వివిధ కార్యాలయాలు, సంస్థలలోని పాత సామాన్లను ఈ నెల 18వ తేదీ వేలం నిర్వహించనున్నట్లు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 వరకు పెద్ద అల్యూమినియం వంట పాత్రలు, 200 ఇనుప, ప్లాస్టిక్ పాత కుర్చీలు, కుట్టు మిషన్లు, ఇతర వస్తువులకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకల్లా జిల్లా పోలీసు కార్యాలయంలోని రిజర్వ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్దకు రావాలన్నారు. పూర్తి వివరాలకు 9121102221 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ముగ్గురికి గాయాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడు

కొనకనమిట్ల: వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొనకనమిట్ల మండలంలోని చిన్నారికట్ల జంక్షన్ సమీపంలో బ్రిడ్జి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరుకు చెందిన వివేక్, విజయభాస్కర్, వంశీ తదితరులు శ్రీశైలం వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో చిన్నారికట్ల జంక్షన్ సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పింది. రహదారి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లడంతోపాటు బ్రిడ్జి గోడలకు కారు బలంగా తగలడంతో ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులకు 108 అంబులెన్స్ సిబ్బంది ఖాశీంవలి, ఖాజా మస్తాన్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.